క్లుప్తంగా

సామాన్య భక్తులకు పెద్దపీట



వినయ్‌చంద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: సామాన్య భక్తులకే పెద్దపీట వేసి, వారు సంతృప్తి చెందేలా దర్శనం కల్పించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్ అన్నారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, వేదపండితులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఈ నెల 21 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలోకి భక్తులు ప్రవేశించే క్యూలైన్లు, అలాగే వెలుపలకు వచ్చే క్యూలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, మురళి, లోకేష్, విద్యాసాగర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం ఈ మేరకు వర్సిటీ వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఉదయ్, చంద్రనాయక్ మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్, వర్కర్స్ నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. మెస్ బిల్లులు విపరీతంగా పెంచి వేధిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే మెస్ కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహ, రాజు, ఉదయ్, శశి, ప్రశాంత్, కిషోర్, శాంతి రెడ్డి, బాబు, మనోహర్, నరసప్ప, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు

వైభవంగా వెంకన్న ధ్వజారోహణం

- పెద్ద శేష వాహనంపై విహరించిన స్వామివారు

చంద్రగిరి: కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకార్యాలను పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై, గరుడాళ్వార్, చక్రతాళ్వార్‌లు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తదుపరి మీన లగ్నంలో ఆలయ అర్చకులు, విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జేఈఓ వీరబ్రహ్మం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడ పటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



విశ్వక్సేనుల సమక్షంలో ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడి అలంకరణలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు



వాహన సేవ ఎదుట కళాకారుల ప్రదర్శన

పెద్ద శేషుడిపై శ్రీనివాసుడి వైభవం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు స్వయంగా ఊరేగింపులో పాల్గొనే మొదటి ఉత్సవం పెద్ద శేషవాహనం. మంగళవారం రాత్రి కల్యాణ వెంకన్న శ్రీదేవి, భూదేవి సమేత పెద్ద శేష వాహనంపై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అయిన బుధవారం ఉదయం స్వామి వారు చిన్న శేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై ఊరేగనున్నారు.

శాంతి భద్రతలపై సమీక్ష

తిరుపతి అర్బన్: తిరుపతిలోని మంగళం మార్గంలోని ఓ హోటల్లో మంగళవారం దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా అంశాలపై సమీక్షించినట్లు సమాచారం. డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి అధికారుల సమీక్షను నిర్వహించారు.

విలువలతో కూడిన వైద్యమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా : పేదలకు విలువలతో కూడిన వైద్యసేవలే లక్ష్యంగా వైద్య విద్యార్థులు కృషి చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్ సూచించారు. మంగళవారం ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో 2019 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులకు ఆయన సందేశాత్మక ప్రసంగాన్ని అందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో విలువైనదని, నీతి తప్పకుండా వైద్యం అందించినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవి ప్రభు మాట్లాడుతూ వైద్యం అనేది అన్ని రంగాలలో అత్యుత్తమమైందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

హక్కులు హరిస్తే సహించం

పాకాల : కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరిస్తే సహించే ప్రసక్తే లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం స్పష్టం చేశార. మంగళవారం స్థానిక సీఐటీయూ భవనంలో జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం, జిల్లా సహాయ కార్యదర్శి జైచంద్ర మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కార్యవర్గం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ప్రసాద్, సహాయ కన్వీనర్లుగా మురళి, మధుసూదన్‌రావు, కమిటీ సభ్యులుగా ఆనంద్, వేణు, జగదీష్, కేశవులు, బాబు, లక్ష్మయ్య, గోవిందును ఎంపిక చేశారు.

నారా లోకేష్ హామీని నిలబెట్టుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి అర్బన్: రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో కామన్ పీజీ సెట్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం విద్యార్థి సంఘం నేతలు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి పీజీ ప్రవేశాలు నిర్వహించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి విశ్వవిద్యాలయాల్లో 30 నుంచి 40 శాతం అడ్మిషన్స్ లేక యూనివర్సిటీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయని వివరించారు. ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలను నిర్వహించుకునేలా చర్యలు తీసుకొని కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు అక్బర్, రవి, ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, మల్లికార్జున, తిరుమలేష్, సుందర్ రాజ్ పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్ రద్దుకు వినతి

తిరుపతి సిటీ : ఏపీ పీజీ సెట్, ఏపీ ఆర్ సెట్ కామన్ ఎంట్రన్ విధానం రద్దు చేయాలని ఏఐఎస్‌ఏ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్‌కుమార్, చిన్న కోరారు. మంగళవారం ఈ మేరకు మహిళా వర్సిటీ వీసీకి వినతిపత్రం సమర్పించారు.

నారావారిపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణ



శిక్షణార్థులకు టైలరింగ్ మెటీరియల్‌ను అందజేస్తున్న అధికారులు

చంద్రగిరి: నారావారిపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సంకల్ప్ పథకం ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి రెండు బ్యాచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రేణుక, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఏపీ ఎస్ఎస్‌డీసీలు హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు అవసరమైన మేరకు వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. నారావారిపల్లె, కందులవారి పల్లె, భీమవరం, శేషాపురంలో ఉన్నటువంటి ఎస్ఎస్‌జీ సభ్యులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శిక్షణార్థులకు టైలరింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు.

నక్షా ప్రోగ్రాంతో పక్కా భూ రికార్డులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుపతి తుడా: నక్షా ప్రోగ్రామ్‌తో పక్కాగా భూ రికార్డులు తయారవుతాయని తిరుపతి ఎంపీ ఎం. గురుమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్’ (నక్షా) సర్వే పై వర్క్‌షాప్‌ను ఆయన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ మౌర్యతో కలసి ప్రారంభించి ప్రసంగించారు. నక్షాలో భాగంగా భూములను నిష్పక్షపాతంగా సర్వే చేపట్టాలని సూచించారు. తిరుపతిలో పలు భూ సంబంధిత సమస్యలు ఉన్నాయని, బయటి దేశాలలో మన జిల్లా వాస్తవ్యులు ఉన్నారని వారికి ఒక భరోసా, ఒక నమ్మకం కలగాలంటే సర్వే పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ సుబ్రమణ్యం మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు సర్వే చేయాలన్నారు. తిరుపతి మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్, ఉప కమిషనర్ అమరయ్య, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ సర్వేయర్ దేబబ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం

తిరుమల: తిరుమలలో రద్దీ పెరిగింది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు శ్రీవారి సర్వదర్శనం సుమారు 12 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. మంగళవారం సాయంత్రానికి 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు 60,784 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 25,521 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.29కోట్లుగా అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే నిరాహార దీక్ష



రైల్వే కార్మికుల దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): సమస్యల పరిష్కారం కోసం రైల్వే కార్మికులు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు తిరుపతి రేణిగుంట మార్గంలోని సీఆర్ఎస్ మెయిన్ గేట్ ఎదుట మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఆర్ఎస్‌లోని కార్మికులు సుమారు 200 మంది పాల్గొన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం నిరాహార దీక్ష శిబిరం వద్దకు చేరుకున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులు వారికి వినతి పత్రం సమర్పించారు.

డిమాండ్లు ఇవే

- 8 పే కమిషన్ వేతన సంఘం కమిటీని ప్రకటించి 2.86 రెట్లు పెంపుదల చేసి కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి. – పాత పెన్షన్ అమలు చేయాలని
- కోవిడ్ కాలంలో నిలిపివేసిన 18 నెలల డీఏ అరియర్స్‌ను విడుదల చేయాలి.
- ప్రతి మహిళా ఉద్యోగికి నెలకు మూడు రోజుల ప్రత్యేక సీఎల్ మంజూరు చేయాలి.
- ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికులపై పడుతున్న పని ఒత్తిడిని తగ్గించాలి.

కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కోశాధికారి మునికుమార్, యూనియన్ నాయకులు ముని రాదయ్య, హెండ్రి పాల్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రనాయక్, తిలక్‌కుమార్‌రెడ్డి, గాండీవన్, దిలీప్‌కుమార్, నరేంద్ర, అరుణ్, సురేష్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు అండగా ఉంటాం

సి ఆర్ ఎస్ వద్ద రైల్వే కార్మికులు చేస్తున్న నిరాహార దీక్ష శిబిరానికి తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేరుకొని వారికి సంఘీభావం తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ రైల్వే కార్మికుల కోరుతున్నవి న్యాయపరమైన కోర్కెలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్క కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. రైల్వే కార్మికుల సమస్యలను వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా రైల్వే బోర్డు అథారిటీ, రైల్వే శాఖ కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల డిమాండ్లు పరిష్కరించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైల్వే కార్మికుల డిమాండ్లు న్యాయపరమైనవని తప్పకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఎంపీ గురుమూర్తి ద్వారా రైల్వే అథారిటీ చైర్మన్ దృష్టికి మీ సమస్యలను తీసుకొని వెళతామని తెలిపారు. ముఖ్యమైన యూనియన్ నాయకులను ఢిల్లీకి తీసుకొని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆత్మ ‘గౌరవ’ం కోసమే పోరాటం



వెటర్నరీ వర్సిటీ పరిపాలన భవనం ఎదుట బైఠాయించిన విద్యార్థులు

‘‘ఆత్మాభిమానం దెబ్బతీస్తే సహించం.. ఆత్మగౌరవం కోసమే ప్రాణాలైనా అర్పిస్తాం.. డిమాండ్‌లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తాం.. సమ్మెను నీరుగార్చేందుకు యత్నిస్తే సహించం.. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరసన గళం వినిపిస్తాం.. గౌరవ వేతనం పెంచేవరకు ఆందోళన విరమించం’’ అని వెటర్నరీ వైద్య విద్యార్థులు స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు వెటర్నరీ వర్సిటీ పరిపాలన భవనం ఎదుట బైఠాయించారు. 16 రోజులుగా శాంతియుత నిరసన తెలుపుతుంటే.. ఆందోళనను అడ్డుకునేందుకు వర్సిటీ అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే పెద్దసంఖ్యలో పోలీసులను రంగంలోకి దింపి భయాందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. – తిరుపతి సిటీ

మానవత్వంతో ఆలోచించాలి



న్యాయపరమైన సమస్యపై పోరాటం చేస్తున్నాం. పోలీసులను రంగంలోకి దింపిన వర్సిటీ అధికారులు మానవత్వంతో ఆలోచించాలి. అందరు వైద్యవిద్యార్థులతో సమానంగా స్టయిఫండ్ అందించాలని మాత్రమే కోరుతున్నాం. గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవవేతనం కనీస అవసరాలకు సరిపోవడం లేదు. ఇప్పుడు కూడా తల్లిదండ్రులపై ఆధారపడడం బాధగా ఉంది.

– ఎం.ప్రవీణ, విద్యార్థిని, వెటర్నరీ కళాశాల

వివక్ష చూపడం దారుణం



ప్రస్తుతం రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న అన్ని రంగాల వైద్య విద్యార్థులకు ఒక విధంగా, వెటర్నరీ వైద్యులను మరో విధంగా చూడటం దారుణం. అందరికీ సమానంగా గౌరవ వేతనం అందించేవరకు సమ్మెను విరమించం.

– లక్ష్మి, విద్యార్థిని, ఎస్వీ వెటర్నరీ కళాశాల

స్పందించకపోవడం దారుణం



గత 16రోజులుగా గౌరవవేతనం పెంచాలని నిరసనలు తెలుపుతున్నా అధికారులలో చలనం లేదు. గౌరవవేతనం పెంచే వరకు సమ్మె విరమించం. వర్సిటీ అధికారులు మా సమస్యపై పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి సమాచారం అందించలేదని తెలుస్తోంది. సమ్మెను అడ్డుకునే కుట్ర చేసినా వెనుకడుగు వేయం.

– రేణుక, విద్యార్థిని, వెటర్నరీ కళాశాల

ఉన్నతాధికారులకు విన్నవించాం




వెటర్నరీ విద్యార్థులతో సంప్రదిస్తున్నాం. కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తరగతులు నష్టపోకుండా విద్యార్థులు కళాశాలకు హాజరుకావాలి. పశువైద్య విద్యార్థుల డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులకు విన్నవించాం. తక్షణం సమ్మెను విరమించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాం

– రమణ, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, తిరుపతి

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తిరుపతి అర్బన్: గత ఏడాది ఓ దాడి కేసులో మొదటి ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ వివాదాల నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్ నెలలో చెన్నైకి చెందిన మెరీనాతో పాటు శ్రీరాములు, సింధు, కమలమ్మ అనే నలుగురు తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న బ్యూలాతోపాటు ఆమె తల్లి పూంగావనంపై దాడి చేశారు. అప్పట్లోనే కేసు నమోదు చేశామని తెలిపారు. మంగళవారం మొదటి ముద్దాయిగా ఉన్న మెరీనాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన డీఆర్వో నరసింహులు, డీఈఓ కేవీఎన్ కుమార్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ప్రభాకర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదోతరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. జిల్లాలో 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. పదోతరగతి ఓపెన్ స్కూల్స్‌లో 1,019 మంది విద్యార్థులకు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్టు చెప్పారు. అలాగే ఇంటర్మీడియెట్‌కు సంబంధించి మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 2,838 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. డీపీఓ సుశీలా దేవి, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, అదనపు తిరుపతి కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ గురుస్వామి రెడ్డి, ఆర్టీఓ మురళీకృష్ణ, పోలీస్, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా ఆధార్‌కార్డులు

ఆధార్‌కార్డుల నమోదుతోపాటు అప్డేషన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వారిచే నిర్వహిస్తున్న 9 రకాల స్టేట్ హోల్డర్స్ ఆధార్ సెంటర్లల్లో ఆపరేటర్లకు ప్రతినెలా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. జేఈఈ మెయిన్, నీట్ విద్యార్థులకు ఆధార్ అంశాల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. డీఆర్వో నరసింహులు, డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు


అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు


విద్యుద్దీపాలంకరణలో నంది కూడలి

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఉత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా మూషిక వాహనంపై వినాయకస్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఉదయం 5.20 గంటలకు మకర లగ్నంలో చేపట్టే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు.

పటిష్ట ఏర్పాట్లు

స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 26న మహాశివరాత్రి వేడుకల నేపథ్యంలో సర్వం సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో స్వాగత తోరణాలు, భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


మూషిక వాహనంపై ఊరేగుతున్న గణపతి

నేడు వైఎస్సార్‌సీపీ నగర కమిటీ ప్రమాణస్వీకారం

తిరుపతి మంగళం : పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ నగర కమిటీ బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా మల్లం రవిచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష హాజరుకానున్న కార్యక్రమానికి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

హోర్డింగ్‌ల తయారీకి ఆహ్వానం

తిరుపతి అర్బన్ : మహిళా శిశు సంక్షేమ శాఖ హోర్డింగ్‌ల తయారీకి ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 21వ తేదీ లోపు సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం వీఐపీ బ్రేక్ సమయంలో పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో హిందీ భాష అకాడమీ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

సిరులతల్లి సేవలో..

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని మంగళవారం కాశీమఠం పీఠాధిపతి శ్రీమద్ సంయమీంద్రసరస్వతి స్వామి సేవించుకున్నారు. మహాద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోని ముఖమండపంలో ఆయన ఆశీనులై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ క్రమంలోనే బీజేపీ ఎంపీ సీఎం రమేష్, టీటీడీ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.


శ్రీవారి ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి


అమ్మవారి ఆలయం వెలుపల సంయమీంద్ర సరస్వతి

భూమన సుధాకర్‌రెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

తిరుపతి మంగళం : భూమన సుధాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పద్మావతిపురం శ్మశాన వాటికలోని ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తన కుటుంబీకులతో కలిసి పెదనాన్నకు పుష్పాంజలి ఘటించారు.

వీసీగా బీసీలకు అవకాశమివ్వండి

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూ వీసీగా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సంఘర్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో సమితి గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అక్కినపల్లి లక్ష్మయ్య మాట్లాడారు. టీడీపీ ఆవిర్భవం నుంచి ఎస్వీయూ ఉపకులపతిగా బీసీలకు అవకాశం కల్పించిన దాఖలాలు లేవన్నారు. అత్యున్నత పరిశోధన, అధ్యాపక, పరిపాలన అనుభవమున్న బీసీలు ఎస్వీయూ ఉపకులపతి రేసులో ఉన్నారని తెలిపారు. ఐఐటీ ఆచార్యులను వీసీలుగా ఎన్నుకోవడం తెలుగువారిని అవమానించడమేనన్నారు. ఎస్వీయూలో పనిచేసే ఆచార్యులకే వీసీగా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నేతలు సాకం ప్రభాకర్, కట్టమంచి చంద్రబాబు యాదవ్, రమణ, అశోక్ సామ్రాట్, రామయ్య ఆచారి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి వినతి

తిరుపతి అర్బన్ : తిరుపతి-అనంతపురం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలంలో పలు గ్రామాలకు దారి లేకుండా పోతోందని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. గతంలో మెగా సంస్థ ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు నిర్మించాలని కోరారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాని

హామీల అమలుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : ఆటోడ్రైవర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే అమలు చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.శివ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వాహన మిత్ర కింద రూ.15 వేలు ఇస్తామని, జీవో 21,31లను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించి, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు, డ్రైవర్లకు ప్రమాద వ్యక్తిగత చంద్రన్న బీమా పాలసీ రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు చేస్తామని, టాటా మ్యాజిక్ వ్యాన్లు, కార్లు, జీపులకు రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్ తగ్గిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి హామీలు అమలు చేయాలని స్పష్టం చేశారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

చంద్రగిరి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలో మందుబాబులు పడేసిన వ్యర్థాలను తొలగింపజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మందుబాబుల ఆగడాలను అరికట్టేందుకు ముమ్మరంగా గస్తీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.


చెత్తను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

పురస్కార గ్రహీతకు సత్కారం

తిరుపతి కల్చరల్ : తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా జాతీయ బంగారు నంది పురస్కారం అందుకున్న జేసీ ఎం.బాబును ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈమేరకు కొర్లగుంటలోని రవీంద్రభారతి స్కూల్లో కరస్పాడెంట్ బి.రవీంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా జ్ఞాపికల బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భరణి లతారెడ్డి పాల్గొన్నారు.


బాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో మల్టీ పర్పస్ ఇండోర్ హాల్‌ను బుధవారం రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్ : వెంకటగిరి పట్టణంలో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. వెంకటగిరి పురపాలక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరామయ్య మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని వార్డులను సందర్శించాలని సూచించారు. సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.